

# ఓ అన్యాయం

తెనాలి సుశీలాదేవి



కిటికీ తలుపులు తెరిచాను.

తెల్లని వెన్నెల, మలయమారుతం పోటీపడి దూసుకువచ్చాయి గదిలోకి. క్షణంసేపు పరవశించినా దాన్ని మించిన ఆనందానుభూతి కోసం అలవాటుగా ఎదురుచూశాను. తహతహలాడాను.

కిటికీ వూచలకు ముఖాన్ని చేర్చి, పిడికిళ్ళతో వూచల్ని పట్టుకుని తదేకంగా చూడసాగాను.

ప్రక్క డాబామీద పసిపాపకు గోరుముద్దలు తినిపిస్తున్న తల్లి ....ఆ వెన్నెల్లో అలవోకగా సాగివస్తున్న పాట.....

'చందమామ రావే.... జాబిల్లి రావే....'

రెండు చేతులూ పైకెత్తి కేరింతలు కొడుతూ, మూతి చుట్టూ అన్నాన్ని పులుముకుని అందాల పసిపాప.... చిన్న పాప....పా....ప ....

నా గుండెల్ని చీల్చుకుంటూ బరువైన నిట్టూర్పు స్పష్టాస్పష్టమైన అనుభూతి కోసం నా అంతరంగం తపిస్తోంది.

వెనక్కి తిరిగి అడుగులో అడుగేసుకుంటూ వచ్చి వెన్నెల పరచుకున్న పక్కమీద నీరసంగా వాలిపోయాను.

యింకా సేపట్లో వినవచ్చే పాట కోసం...రాగంకోసం...చెవులప్పగించి..

"జో.... అచ్యుతానంద.... జోజో ముకుందా...."

అలలుగా సాగివస్తున్న ఆ జోల పాట నా గుండె తలుపుల్ని తడుతోంది. తేలివస్తున్న పదాలకు పెదవులు కలిపాను. నాకు మాత్రమే వినపడేలా జోల పాడుతున్నాను గుండె లోతుల్లోంచి, హృదయంలోని ఆర్తిని రంగరించి. ఎవరికి యీ జోల........ ఎవర్ని నిద్ర పుచ్చను?....

హృదయ కవాటాలు తొలగదోసుకుని లావాలా పొంగుతోంది ఆవేదన. క్రమంగా అది కరిగి అశ్రువులుగా మారి ....చెంపల మీదుగా కారి.... చెవుల వెనక్కు జారి....

మెత్తగా.... చల్లగా తడుస్తోంది నా తలగడ.

ఒత్తుగా మూసుకున్న కనురెప్పల వెనుక కదిలిపోయే నీడలు.... వాటిల్లో నిజాలు....

* * *

ఆ వుదయం....

వంట సగంలో వుండగానే తలుపు తట్టిన చప్పుడికి కొంగుతో చేతులు తుడుచుకుంటూ గబగబా వెళ్ళి తలుపు తీశాను 'ఎవరై వుంటారా' అనుకుంటూ.

"మీరా? అదేం అప్పుడే వచ్చేశారు యివాళ" అన్నాను అప్రయత్నంగా. క్షణం సేపు నా కళ్ళలోకి చూసి 'వంట అయిందా' అన్నారు ఆయన.

"యింకా లేదు" లుంగీ అందిస్తూ సందిగ్ధంగా చూశాను ఆయనముఖంలోకి.

"త్వరగా కానీ. పనుంది," పెరట్లోకి వెళ్ళిపోతున్న ఆయనకేసి అయోమయంగా చూశాను.

ఆదరాబాదరా పనిలో జొరపడ్డాను.

"అమ్మ ఉత్తరం వ్రాసింది" వంటింటి గుమ్మానికి ఆనుకుని తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ అన్నారు.

"అలాగా! అత్తగారు బాగానే వున్నారటా? మీ చెల్లెలు ప్రసవించిందా? మిగతా పిల్లలు...." నా మాట యింకా పూర్తి చేయనేలేదు.

"అంతా బాగున్నారు. వంట కాస్త త్వరగా ముగించు. యింకో గంటలో బస్సుంది." అంటూ పడగ్గదిలోకి వెళ్ళారు.

నా వెన్నులో చిన్న జలదరింపు. సంబాళించుకున్నాను.

"అంటే...." గుమ్మంలోకి వచ్చి అడిగాను ఆత్రుత నణుచుకుంటూ.

"నువ్వు వున్నపళంగా బయలుదేరి రమ్మని వ్రాసింది అమ్మ. అక్కడేదో సంబంధం వుందిట. అమ్మాయి చాలా బావుంది. ఎవరి పెళ్ళికనో వచ్చారుట. యిక్కడే చూసేస్తే సరిపోతుంది. వాళ్ళు వెళ్ళిపోతే మళ్ళీ చూపులకని అంతంత దూరం...." ఆ తరువాత మాటలు నాకు వినబడలేదు. తలమీద సమ్మెటతో కొడుతున్నట్టు చెవుల్లో హోరు.

విన్నంతవరకు అర్థమయిన మాటల ప్రభావం.

పెదవుల బిగింపు మాటున దుఃఖాన్ని అదిమిపట్టాను. నా కళ్ళు నిండిన తటాకాలు అయ్యాయి.

"జానకీ...." అన్నారాయన మెల్లిగా.

ఒక్కంగలో ఆయన్ని చుట్టేశాను. తటాకాలకి గండి పడింది, ఆయన గుండెల్ని తడుపుతూ.

కంఠంలో సుళ్ళు తిరుగుతున్న దుఃఖంలో పూడుకుపోతున్న కంఠాన్ని బలవంతంగా.... పెగుల్చుకున్నాను.

"నన్నెందుకు యిట్లా అన్యాయం చేయాలని చూస్తారు?"

"చూడు జానకీ! నీ యీ ప్రశ్నలు వాటికి నా బదుళ్ళు, నీ ఏడుపు, నా చిరాకు యిలా యీ విషయంమీద జరిగే ప్రతిమాటా, చర్యా మనకి మధ్య మామూలే. మార్పులేనిది. మళ్ళీ మళ్ళీ ఎందుకు చెప్పు. ఎన్నిమాట్లు నీ వడిగినా ....నేను చెప్పగలిగేది ఒక్కటే. 'నేను తండ్రిని కావాలి' నాకో వంశాంకురం కావాలి, సరేనా."

తన భుజాలని చుట్టుకున్న నా చేతుల్ని విడదీసి వెనక్కి తిరిగి బట్టలు సర్దుకోసాగారు.

'యింకేం మాట్లాడను?' కాళ్ళలో శక్తి లాగేసినట్టయి నిలబడలేననిపించింది. కాళ్ళు యీడ్చుకుంటూ వంటింట్లోకి వచ్చాను.

కూర మాడిపోయి వుంది. దాని గురించి బాధపడే స్థితిలో లేను.

ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించింది. నిలబడలేకపోయాను. తలుపు నానుకుని పిచ్చిదానిలా కూర్చుండిపోయాను.

కుమిలిపోతున్న గుండె కాస్త కుదుటపడి కళ్ళు తెరిచి చూసేసరికి ఆయన లేరు. సర్దుకున్న సూట్‌కేస్ లేదు.

అంత రంపపుకోతలోనూ ఆయన అభోజనంగా వెళ్ళిపోయారన్న బాధ నన్ను నేనే నిందించుకునేలా చేసింది.

వండిన అన్నం, మాడిన కూర అలానే వుండిపోయాయి.

యింత బాధలోనూ భోజనమన్నా మానేసింది గానీ కనుచీకటివేళ గది కిటికీలో కనిపించి కొన్ని క్షణాలపాటు తనను మురిపించి, పరవశింపచేసి ఆ పైన హృదయాన్ని భారంచేసి, కన్నీళ్ళతో తేలికపరచి యిన్ని రకాలుగా తనను లోబరుచుకున్న దృశ్యాన్ని చూడటం మాత్రం మానలేకపోయాను.

* * *

దాహంగా అనిపించి లేచి కూర్చున్నాను. తలగడ తడిసిపోయి వుంది. నాలో నాకే నవ్వు వచ్చింది. శుష్కహాసం.

యిలా ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు....

యిక దీనికి అంతంలేదు. యీ జీవితమిలా కన్నీళ్ళతో కరిగిపోవలసిందే. వాడిపోతున్న ఆశాలతకు ఎప్పటికప్పుడు ప్రాణం పోసుకుంటూ భగవంతుడిమీద భారం వేసి, నమ్మకాన్ని పెట్టుకుని, భవిష్యత్ ప్రాంగణంలో, మాధుర్యపు రంగవల్లులు దిద్దుకోటానికి ఆశల చుక్కలు పేర్చుకుంటూ చేసుకుపోతున్న యీ కాపురం యింతటితో కూలిపోబోతోందా?

పిచ్చిగా భర్తచుట్టూ అల్లిబిల్లిగా అల్లుకున్న యీ ప్రేమబంధాలు తెగిపోబోతున్నాయా?

యిలా అనుకునేసరికి గుండెలోంచి దుఃఖం తన్నుకొచ్చింది.

శతకోటి కోర్కెలతో పెళ్ళికూతుర్ని అయాను.

కళ్ళనిండా కలలు నింపుకుని కాపురానికి వచ్చాను.

ఒక మగవాడి భార్యగా అలరించాలని అతని పిల్లలకు తల్లిగా అపూర్వానుభూతితో పరవశించాలని....

ప్రేమానుభూతుల మయమైన తమ చిన్ని సంసారంలో నవవసంతం వెల్లివిరుస్తూండాలని.... ఎన్నెన్ని....

నేనే మోడయిపోతానని, అనుబంధాలకు, అనురాగాలకు అనర్హురాలినవుతానని అనుకోలేదే.

జిలిబిలి కోర్కెలతో వుయ్యాలలూగే యీ హృదయంనిండా వెలితి, శూన్యం పూడుకుపోతాయని వూహించనైనా లేదే.

ఇటువంటి స్థితి ఎంత భయంకరంగా వుంటుందో ఎంత బాధాకరంగా వుంటుందో యిప్పుడిప్పుడు బాగా అనుభవమవుతోంది.

ఈ బాధాగాథల తీరానికి చేరేముందు అంచెలంచెలుగా నన్ను నెట్టుకొచ్చిన

గతస్మృతుల వెల్లువ నా కళ్ళముందు సుళ్ళుతిరుగుతూ వుంది. కల్లలయి పోయిన నా కలలు నన్ను వెక్కిరిస్తున్నాయి.

'ఈ అమాయకురాలు ఎట్లా సంసారం చేస్తుందో, ఎట్లా పిల్లల్ని కంటుందో ఏమో' అంటూ వందసార్లయినా అన్నది, అమ్మ నన్ను కాపురానికి పంపేటప్పుడు.

ఏ తల్లికయినా తన బిడ్డ గురించి అలాంటి బెంగే వుంటుందేమో.

నాలో నేనే నవ్వుకున్నాను అప్పుడు.

నా సిగ్గుని, ముగ్ధత్వాన్ని వీళ్ళు అమాయకంగా తీసుకుంటున్నారా? నా గుండెల్లో ఎంత పిచ్చి ప్రేమ వుందో, అది ఎలా పరవళ్ళు తొక్కుతుందో, నాలో ఎన్ని జిలిబిలి కోర్కెలు ముసురుకుంటున్నాయో, నా సంసార సౌధానికి ఎన్ని ఆశల మెట్లు పేర్చుకుంటున్నానో వీళ్ళకు తెలిస్తే....

కళ్ళనిండా కలలు నింపుకుని కాపురానికి వచ్చాను.

అత్తగారు, బావగారు, తోటికోడలు, నాతోపాటే పెళ్ళయిన ఆడపడుచు, బావగారి పిల్లలు వీళ్ళందరి మధ్య సందడి సందడిగా గడిచిపోయింది.


ఆడపడచు, నేను కొత్త పెళ్ళికూతుళ్ళం సిగ్గుసిగ్గుగా ఒకరి గురించి ఒకరు తెలుసుకోటానికి ప్రయత్నించటం....

వీటన్నిటి మధ్య శ్రీవారి కన్నుసైగలు, తర్జనికో బెదరింపులు రోజంతా పండగలాగే గడిచిపోయాయి.

హృదయంలో వింతగా స్పందించే అపూర్వక్షణాలు, మధురమైన రాత్రులు మందమందంగా సాగిపోయాయి.

పుష్కరం గడిచింది. ఆడపడుచుకు ముగ్గురు పిల్లలు. నేను మాత్రం తల్లిని కాలేదు.

మొదట్లో మొదట్లో కనబడ్డ ప్రతి వాళ్ళూ అడిగేమాట 'ఏమైనా విశేషమా',




'నీళ్ళోసుకున్నావా?....' నెల తప్పావా?... యిలా యిలా....

అప్పట్లో చచ్చేంత సిగ్గు ముంచుకొచ్చేసి తలవంచేసుకునేదాన్ని. రాను రాను ఆ ప్రశ్నకి జవాబుగా తలనే వంచుకునేదాన్ని కాని అవమానభారంతో. ఏళ్ళు గడవను ఎవరికంటపడితే యీ ప్రశ్న వేస్తారేమోననే భయంతో తప్పుకు తప్పుకు తిరగటం అలవాటుచేసుకున్నాను.

ఆడపడుచుకి మూడు పురుళ్ళు పోసినా నేను మాత్రం పురుటి మంచం ఎక్కలేదు. ఈ వ్యధ నన్ను బాగా క్రుంగదీసేది.

అనుబంధం, అనురాగం మనిషికీ, మనసుకూ కూడా ఎంతో అవసరం. అవి పెంపొందేలా చూడాలే తప్ప కరిగిపోటం జరిగితే....

నా విషయంలో సరిగ్గా యిలాగే జరుగుతోంది.

ఐదేళ్ళకన్నా యిక ఓపిక పట్టలేక పోయింది అత్తగారు. ఆ అసహనం నేను వింటే బాధపడతానేమో ననుకునే స్థితినుండి వినాలని, బాధపడాలని.... ములుకుల్లాంటి ఆ నిందావాక్యాలు చేసిన గాయాలన్నిటిని మౌనంగా భరించి రాత్రయ్యేసరికి ఆయన ఎడదలో తల దూర్చుకుని మూగగారోదించి కన్నీళ్ళతో మాన్పుకునేదాన్ని.

ఆరంభంలో అనునయించేవారు. తరువాత్తరువాత నిర్లిప్తంగా వుండి పోయేవారు. 'రోజూ చచ్చేవాడికోసం ఎవరు ఏడుస్తారు?' నాకు నేనే సమాధానం చెప్పుకొనేదాన్ని. నన్ను నేనే ఓదార్చుకొనేదాన్ని.

చెప్పిన పూజల్లా చేశాను. మొక్కమన్న ప్రతి రాయికీ, రప్పకీ మొక్కాను. నాతోపాటు అత్తగారూ విసిగిపోయింది.

పెరట్లో తులసిమొక్కకి ప్రదక్షిణ చేసి చెంబులోని నీళ్ళు మొక్కకి పోస్తూంటే....

"ఏం పూజలు చేస్తే ఏంచెయ్యను? గొడ్డుబోతుతనం ముఖాన రాసివుంటే..." మాటలు రివ్వున వచ్చి యీటెల్లా గుచ్చి.... ఉబికిన కన్నీళ్ళు జారి.... రాలి చేతిలోంచి జారుతున్న నీళ్ళలో కలిసిపోయి మొక్కని తడుపుతూ....

"మా వంశంలో ఎటు వెతికినా లేరమ్మా లేరు. వాడి ఖర్మే యిలా కాలింది. బిడ్డా, పాపా అచ్చటా, ముచ్చటా ప్రాప్తంలేదు. కోడలి కడుపునో కాయకాయాలని, నానమ్మ అని పిలిపించుకోవాలని నేనే తల్లడిల్లిపోతున్నాను.

యిక 'నాన్నా' అనిపించుకోవాలని వాడికి మాత్రం వుండదూ...."

యీ దీర్ఘాలు వినేకొద్దీ నా హృదయం తలుపుసందులో పెట్టి నొక్కుతున్నట్టు గిజగిజలాడేదాన్ని.

నాకుమాత్రం 'అమ్మా' అనిపించుకోవాలని లేదూ? నా బాధను గుర్తించరెందుకు? నేనేదో కావాలని అపరాధినయినట్టు మాట్లాడుతారేమిటి.

యీ ఆలోచనలతో నా తల బద్దలు అయ్యేది.

యీ మధ్య యింట్లో కొత్తగాలి వీచటం గమనించాను.

నేను వినాలనే అంటున్న మాటలు గనుక నాదాకా వస్తూనే వున్నాయి.

"దా నదృష్టం యిలావుంది ఏంచేస్తాం. ఎన్నాళ్ళని? అదునులో లేకపోయాక ఎందుకిక బిడ్డలు? యింకో పెళ్ళయినా చేస్తే అదృష్టం పండుతుందేమో...."

మొదటిసారిగా విన్నపుడు గుండె గుభేలు మంది. యీవిడే అంటోందా? ఆయనకీ యీ వుద్దేశం వుందా? అడగాలనుకున్నాను. ఆ రోజంతా చిరచిరలాడుతూ వుంది మనసు.

తీరా రాత్రి దగ్గర చేరాక నాకై నే నడగటం, ఆ ప్రసంగం తేవటం నన్ను అవమానించుకోటమే ననిపించింది. ఆయన నోటంటే వచ్చినపుడు చూద్దాం అని దాటేశాను.

ఆ రోజు రావటానికి ఎన్నాళ్లో పట్ట లేదు.

"అమ్మ సంబంధాలు చూస్తోంది" అన్నారు ఆ రాత్రి ఎటో చూస్తూ.

ఆ మాట వస్తుందని ఎదురు చూస్తున్నదే కనుక పెద్దగా సంచలనం కలిగించలేదు.

"ఎవరికి" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ. నడుంమీద చేయివేసి, ఒక్కక్షణం నా కళ్ళలోకి చూశారు.

"తెలీకే అడుగుతున్నావా."

"మాట తెలీకకాదు. మనసు తెలుసుకోటానికి" కప్పుకున్న స్థయిర్యపు ముసుగు జారిపోతోంది. బేలతనం బయటపడటానికి యింకెన్ని క్షణాలో పట్టవని నాకు తెలుస్తోంది.

"ఆ మనసు ఒక్కమాటలో తెలియాలంటే చెప్పనా. 'నేను తండ్రిని కావాలని వుంది' జానకీ!" గుండెలోని కోరిక స్వరంలో తెలుస్తోంది.

అప్పటిదాకా బింకంగా వున్న నా మనసు కుంచించుకు పోసాగింది. అతడి కోర్కెని.... అత్యంత సహజమైన ఆనందాన్ని అందించలేని అభాగ్యురాలిని. మరొక్క మాటయినా పలుక లేక పోయాను. వ్యథాభరిత హృదయాన్ని తేలికపరచుకునే ప్రయత్నంతోనే తెల్లవారిపోయింది.

ఆ తరువాత మామూలుగా వుండలేక పోయాను. మనసు మూగపోయింది. కోరికలూ మూగపోయాయి.

ఏదో ప్రయత్నాలు జరుగుతున్నట్టు చూచాయగా తెలుస్తోంది.

తిరిగి ఒక రాత్రి....

నాలో మూగపోయిన కోరికను రేకెత్తించటంలో సఫలత పొంది, అలసిపోయి, సోలిపోయిన నా నడుంమీద తలపెట్టుకుని.... వాలుగా పడుకుని....

"రేపు అమ్మాయిని చూడటానికి వెడుతున్నానోయ్" అన్నారు.

"ఏ అమ్మాయిని...." అన్నాను మత్తుగా. పారవశ్యం మాటున మరుగు పడిన వాస్తవం.

"అదే.... నీకో పార్టనర్ని....అంటే సవతిని...."

తేనెలు కారిన పెదవుల మీదుగా తేలి వస్తున్న కత్తులు.

ఎంత సున్నితంగా, తీయగా, గుండెలో బాకులు గుచ్చగలరు. కంటికి కనపడని గాయం, అది చిందించే రక్తం వీళ్ళ వూహకి అందదా.

బాధను ప్రస్ఫుటం చేయకుండా అ తలమీద జుట్టుని సవరిస్తూ అడిగాను.

'నిజంగానా?' నిజమేనని తెలుసు నాకు.

"మరి."

"మీ కిది న్యాయంగా వుందా...." అడగటంలో నేను అన్యాయమైపోతున్నా నన్న భావం నన్ను నిలువెల్లా ముంచి... తడవటానికి ఎంతోసేపు లేదు.

"నేను తండ్రిని కావాలని కోరుకోటంలో న్యాయంలేదా...."

"నాకు కూడా తల్లిని కావాలని ఆశ లేదంటారా...."

"నా కెంత అవమానంగా వుంటోందో నీకు తెలీదు...." విసురుగా అన్నారు.

'అవమానం' నాకు తెలీదా....అంత బాధలోనూ నవ్వొచ్చింది.

"నీ వీ నాలుగు గోడల మధ్యా వుంటావు. అలా బయటకు వస్తే తెలుస్తుంది. పరిచయస్తులు, స్నేహితులు ఎంత హాస్యాలాడుతున్నారో.... అపహాస్యాలు చేస్తున్నారు....

"అందుకని...." చటుక్కున అడిగాను.

"యింకో పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాను" నిర్దుష్టంగా అన్నారు.

యిప్పుడు అర్థమైంది బాగా నాకు. తండ్రి కావాలన్న ఆనందం కన్నా తన 'మగతనం' ఋజువు చేసుకోవాలన్న ఆరాటం, ఆక్రోశం, పౌరుషం.

"నామాట ఒకటి వింటారా?" అన్నాను చేత్తో లాలనగా ఆయన వీపుని నిమురుతూ.

'ఏమిటి?' అన్నట్లు చూశారు

"ఒక్కసారి మనిద్దరం కలిసి డాక్టరు దగ్గరికి...." నా మాట పూర్తికాలేదు.

"నీవు వెళ్ళావుగా. ఒకటి రెండు చిన్న ఆపరేషన్లు కూడా చేసుకున్నావు"

"అందుకే... మీరు కూడా ఒకసారి...

"నోర్మూయ్. తగుదునమ్మా అని అదొక్కటే తరువాయి. అయినా నీకు

తెలుసుగా మా వంశంలోనే ఆడగానీ, మగగానీ నిస్సంతులుగా లేరు తెలుసా..." విసురుగా అన్నారు. కొట్టొచ్చిన అహం భావం.

నేనేం మాట్లాడలేకపోయాను ఆ విసురు చూసి. మాసీ నా గొంతులో కొట్టుకులాడుతున్నాయి. "మరి మా వంశంలోనూ ఒక్కరూ లేరు అలాంటి వాళ్ళు" అని,

వేదన వెల్లువ పొంగుతోంది. ఆపటం నావల్ల కాలేదు.

ఏమనుకున్నారో దగ్గరికి చేర్చు కున్నారు.

"చూడు జానకీ! నాకు నీమీద కష, కార్పణ్యం లేవు. అసంతృప్తి, అసహ్యం అసలే లేవు. కాని నాకున్న ఆ ఒకే ఒక్క లోటుని తీర్చుకోటంకోసం నిన్ను బాధపెట్టవలసి వస్తోంది. యిన్నేళ్ళు ఎదురుచూశాను కాదా. ఒక్కనాడయినా నిన్ను నొప్పించానా...." అనునయంగా అంటున్నారు.


నిజమే. ఒక్కనాడూ నొప్పించలేదు. కాని యిన్నేళ్ళది కట్టకట్టుకుని ఒక్క సారిగా తీర్చుకుంటున్నారు అనిపించింది.

'ఆయన చెబుతున్నది కూడా సమం జసంగానే వుందిగా' నాలో ఏ మూల నుంచో సమర్థింపు.

ఆ తరవాత ఆయన సంబంధాల కోసం వెళ్ళలేదు గానీ అత్తగారు మాత్రం వాకబుచేయటం, అక్కడా యిక్కడా అమ్మాయిల్ని చూసిరావటం వారితో వివరాలు చెప్పుకుంటూ యిద్దరూ నాకు వినబడకుండా మాట్లాడుకోటం జరిగేది.

ఏ రాత్రి.... ఏ క్షణాలలో నా గుండెలమీద బాంబు పేలబోతుందో అని ఎప్పటికప్పుడు ఆ తాకిడికి అయత్త మయ్యేదాన్ని.

ఒక్కోసారి అనిపించేది నాకు. నా సమ్మతం లేకుండా రెండో పెళ్ళి ఎలా




చేసుకుంటారు? వుద్యోగం పూడదూ.... నేరం కాదూ.... నేను కాదని మొండి కేస్తే ఏంచేస్తారు? అనిపించేది.

బ్రతుకు మరింత దుర్భరం కావటం తప్ప సార్థకత ఏముంది? శత్రువులా మిగిలిపోటం మినహా సామరస్యం మృగ్యమే కదా.

యిలా సాగేవి నా ఆలోచనలు.

ఎంత సమర్థించుకో చూసినా నా ప్రేమను, నా భర్తను, నా పడకను మరో స్త్రీతో పంచుకోటం అన్న వూహనే భరించటం నావల్ల అసాధ్యమైంది.

నా కళ్ళముందే నా భర్త మరో దాంతో సరసాలు సాగిస్తే చూస్తూ, అది పిల్లలు కంటుంటే పురుళ్ళు పోస్తూ వెలిసిపోయిన నవ్వు నవ్వుకుంటూ కలిసి బ్రతకాలా? యింతకంటే చావు మేలు కాదూ.

మా ప్రేమకుటీరంలోకి మరో ఆడ దాని ప్రవేశం, నా సంసారంలో తనకు భాగం పంచటం భరించలేననిపించింది. ఈ ప్రేమబంధం నా ఒక్కదానికే పరి మితం కావాలి. నా భర్త నా కొక్క దానికే మిగలాలి. ఈ సంసారం, ఈ మాధుర్యం నాకు మాత్రమే వుండాలి.

యిలా అనుకునేదాన్ని. అనుకోడం వరకేగాని తీరదని తేలిపోయింది.

ఆ భగవంతుడికి కూడా నా మీద కక్షే. లేకపోతే....

* * *

గత స్మృతులు మననం చేసుకుంటూ ఎప్పుడు నిద్రలోకి జారానో గానీ పని మనిషి కేకలకి వులిక్కిపడి లేచాను. బాగా తెల్లారిపోయింది. నీరసంగా వుంది. నిన్న ఆయనట్లా వెళ్ళిపోయాక పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. దానికి తోడు కలతలు, కన్నీళ్ళు....

భోజనానికి వచ్చేస్తారనుకుని ఆయనకి వంటచేశాను. అనుకున్నట్టే వచ్చారు. చేతిలో ఉత్తరం వుంది. అందించటం తప్ప ఒక్క మాటా మాటాడలేదు.

చదివాను. అమ్మ వ్రాసింది. 'నాన్న గారికి ఒంట్లో బాగాలేదు. తనకి అంతంత మాత్రంగానే వుందిట. ఎవర్ని రమ్మందా మన్నా పిల్లాపీచు జంజాటాలు. నీవాక నెలపాటు అల్లుడుగారి నడిగి రాగలిగితే బావుంటుంది. తప్పక వస్తావని చూస్తుం టాను' యిదీ సారాంశం.

జంజాటం లేదుట నాకు. పిల్లాపీచు లేరుగా.... ఏదో కసి. నా మీద నాకే. ఆ ఉత్తరం ఒక విధంగా నాకు సహాయం చేసింది.

కృత్రిమమైన యీ వాతావరణం నుంచీ.... మనసుని చిన్నాభిన్నం చేస్తున్న యీ సమస్యలనుంచీ కాస్త

విశ్రాంతి తీసుకోవాలని వుంది. వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. నేను వెళ్ళిపోతే.... ఏదో శంక.

వీళ్ళు వీళ్ళ ఏర్పాట్లు చేసేసుకుంటారుగా.... భయం.

వెళ్ళకుండా వుంటే మాత్రం చేసు కోరా.... నీవు అపుతావా.... మనసు ఎదురుతిరుగుతోంది.

చూసివచ్చిన సంబంధం గురించి గానీ, తన ప్రయాణం గురించి గానీ ఒక్కమాటా అనలేదు ఆయన.

భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళినవాళ్ళు రాత్రికిగాని రాలేదు.

రాగానే భోజనం చేసి ఏదో ఉత్తరం రాసుకుంటూ కూర్చున్నారు.

పక్కమీద పడుకుని తదేకంగా తన ముఖంలోకే చూస్తూండిపోయాను.

భయమో, బాధో, పిచ్చో, ప్రేమో నా గుండెలో తన్నుకు వస్తున్నాయి. అతలాకుతలం చేస్తున్నాయి.

రేపు వెళ్ళాలనుకున్నాను గనుక యీ రాత్రిని దూరంగా గడపాలని లేదు. అ సామీప్యంలో కోరిక దహించటం లేదు. లాలన కావాలి నాకు.

సవతిగా తీసుకురావటానికి పెళ్ళి చూపులకు వెళ్ళివచ్చిన భర్త పరిష్వంగాన్ని, లాలనను కోరుకుంటున్న యీ ఆడతనంమీద, బేలతనంమీద నాకే అసహ్యం వేసింది. అయినా మనసు చంపుకోలేకపోయాను.

తండ్రి కావాలన్న ఆశ తప్ప నా మీద మరే విధమయిన కార్పణ్యంలేని ఆయన నాకు కావలసింది యిచ్చారు. యింత తతంగంలోనూ మా యిద్దరి మధ్య మరే ప్రసక్తి రాకపోవడం విచిత్రం.

ఆయన నిద్రపోయారు. మంచినీళ్ళకని లేచాను. టేబిలుమీద వ్రాసిపెట్టిన ఉత్తరం చదవాలన్న ఆరాటాన్ని జయించలేక పారిపోయాను.

నా తలమీద నిప్పులు కురుస్తున్నట్టు, నా శరీరం, మనసు అణువణువూ భగ్గున మండిపోతున్నట్టు....

"అమ్మాయి నాకు నచ్చింది. మిగతా విషయాలు చూడు. అంతా కుదిరాక జానకికి నచ్చచెప్పొచ్చు...." యిలా సాగింది. పూర్తిగా చదవలేకపోయాను.

అతి ప్రయత్నంమీద మంచం చేరుకున్నాను.

అయిపోయింది. మిగుల్చుకోడానికి కన్నీళ్ళు తప్ప మరేం మిగలని దురదృష్టపు ఘడియలు వచ్చేశాయి. కుమిలి కుమిలి ఏడ్చాను.

ఆయన్ని లేపి అడగాలని... కోపంగా జుట్టు పీకి నానా రభస చేయాలని ఏదేదో పిచ్చిగా అనిపించినా నిద్రాభంగం కలగకుండా మాత్రమే ఏడవగలిగాను.

అంతే నాకేం తెలియనట్టు ఆ మరుదినం ఆయన అంగీకారంమీద పుట్టింటికి వచ్చాను.

నా రూపంలో మార్పుచూసి బాధ పడ్డారేకాని అమ్మా, నాన్నా నా జీవితంలో రాబోవు మార్పు గ్రహించలేకపోయారు.

నోరు విడిచి చెప్పుకోలేకపోయాను. ఎక్కడ నుంచున్నా, కూర్చున్నా, తింటున్నా, పడుకున్నా ఒకటే ఆరాటం, చిత్రవధ.... గుండెలో యీ బరువు మోయలేనేమో ననిపించింది.

వెన్నెల.... చందమామ పాట.... అలవాటయిన నేను పిచ్చిపట్టినదానిలా అయిపోయాను. నా వాలకం అమ్మను భయపెట్టింది.

తనే అడిగాడో.... అమ్మే అడగమందో కాని నాలుగేళ్ళుగా మా వరండా గదిలో వుండి వుద్యోగం చేసుకుంటూ యీ యింట్లో కలిసిపోయిన 'అతను' అడిగాడు.

గుండె భారం తీర్చుకున్నాను.

"మీ పరిస్థితి చాలా జాలిగొలిపేలా వుంది జానకిగారూ" అన్నాడు నేను వచ్చేస్తూంటే.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు. అంతరాంతరాల్లో ఏదో ఆరాటం, ఆత్రుత, హెచ్చరిక, భయం. బాధ, జంకు యివన్నీ కలగాపులగంగా నన్ను చిత్రవధ చేశాక తెగింపుచేశాను.

నన్ను చూసి నిర్ఘాంతపోయిన 'అతని'తో ఆర్తిగా అన్నాను.

"నన్ను తల్లిని చేయగలరా"?

"జా....న....కీ" నిరుత్తరుడయ్యాడు అతను.

"దయచేసి నన్ను కాదనకండి...." నా కళ్ళలోంచి అశ్రువులు జారి అతని పాదాలమీద పడ్డాయి.

"జానకీ...." నా భుజాలు పట్టుకున్నాడతను.

పరాయి మగవాడి స్పర్శతో నా ఒళ్ళు జలదరించింది. తప్పుకుని పారిపోవాలనిపించింది ఒక్కక్షణం. కాని బలీయమైన కోరిక జయించింది. తప్పుచేశాను. తప్పటడుగు వేసేశాను.

* * *


నెలతప్పింది. నా ఆనందం అర్ణవమైంది.

అత్తగారు, ఆయన నా అడుగులకి మడుగులు ఒత్తుతున్నారు. యింట్లో పెళ్ళి ప్రయత్నాల ప్రసక్తే లేదు.

"జానకీ! నీవు బాధపడుతూంటే తల్లడిల్లపోయాను. అయినా నా కోరికని అణుచుకోలేకపోయాను. యిన్నాళ్ళకి కరుణించావు, నన్ను బ్రతికించావు" అంటున్న ఆయన్నిచూసి సిగ్గు, సంతోషం ముఖాన పులుముకున్నా అపరాధభావం నన్ను కుంచింపచేసేది.

జరిగింది తప్పేఅయినా యింతమందికి ఎంత ఆనందం పంచిపెడుతోంది అనిపించేది. తప్పంటూ తెలియదు గనుక.... తెలిస్తే....యిదంతా ఆవిరైపోతే భరించగలనా....

"ఏ దేవుడు కరుణించాడు ....యిన్నా




ళ్ళకి కోడలు నీళ్లోసుకుంది. దానిపూజలు ఫలించాయి" అని అత్తగారు అంటుంటే ఏడవలేక నవ్వువచ్చేది.

పురుటికి పుట్టింటికి వచ్చాను. 'అతను' బదిలీఅయి వెళ్ళిపోయాడట.

ఏదో నిశ్చింత....

కడుపులోని బిడ్డకే పాలబువ్వపాటలు జోలపాటలు పాడుకునే నన్ను చూసి అమ్మా, నాన్నా నవ్వుకునేవారు.

'బాబు' పుట్టినరోజున ఆయన ముఖంలో సంతోషం, ఆ సంతోషంలో చేస్తున్న హంగామా చూసి మధనపడ సాగాను.

నేను చూపిన తెగువ, నా తొందర పాటు నా తప్పిదం యివన్నీ కలుపు కుంటే పిచ్చిగా ప్రేమించిన నేను, ఆయ నకి చేసింది ద్రోహంకాదా.

దూరంచేసుకోలేని ప్రేమ, దగ్గర చేసుకోటానికి ద్రోహం...ఎంతవిచిత్రం. 'నీ కొడుకు అంటూ అందివ్వలేని నేను నిర్మలంగా అతని కళ్ళలోకి చూడలేని నేను వంచిస్తూ కాపురం చేయగలనా?

ఈ మంచితనంతోనే, ఈ అపరాధ భావంతోనే ఎందరు ఆడవాళ్లు తమ మగ వాళ్ళకి దూరమయ్యారో కదా....

యివేవీ భావించని మగవాడు విశృం ఖల విహారం చేస్తున్నాడు.

యిన్ని ఆలోచించినా నేనూ చాలా మంది నడిచిన దారినే నడవాలను కున్నాను. వంచనతో కాపురం కష్టం. పాపభీతితో కలయిక తుచ్ఛం.

ఆత్మప్రక్షాళన చేసుకోకపోతే యీ ద్రోహం నన్ను దహించివేస్తుంది. ఈ అంతరంగ మధనం భరించలేక నా వేదన అంతా ఉత్తరం మూలంగా ఆయనకి నివేదించాను.

"అడవిలోని ఉసిరిక, సముద్రపు వుప్పులా కలిసిన మన బంధం మూడు పూలు, ఆరుకాయలు కావాలని కలలు కన్నాను. నా దురదృష్టం. నా వయసు. మీ అనురాగ డోలికల్లు వూగి వలపులు పండించిందే కాని నా కడుపు పండించ లేకపోయింది. మాతృత్వపు మాధుర్యాన్ని పొందలేని మోడుగా, గొడ్రాలుగా, కుటుంబం దృష్టిలో పనికిరాని ఆడదిగా, మీ దృష్టిలో మొలకెత్తని బీజంగా యిన్ని రకాలుగా నా వునికి దుర్భరమనిపించినా నా దురదృష్టానికి నిందించుకుంటూనే మిమ్మల్ని పిచ్చిగా ప్రేమించాను. భగ వంతుడు అనుగ్రహించని ఆనందాన్ని మీకు యివ్వలేకపోయిన వేదనతో ఆ లోటు కనబడకుండా నా శాయశక్తులా నే నందివ్వగల ఆనందం, అనుభూతి, అనురాగం మీకు పంచాను. ఇంతెందుకు నా జీవితసర్వస్వం మీరేననుకున్నాను. కాని....కాని....నా బంధం తెంచాలని, నా ప్రేమను పంచాలని చూశారు. గుండెలు తూట్లుపడేలా ఎందరి అవహేళ నలో భరించగలిగాను కానీ మీరు నా నుండి జారిపోతారని, నా స్థానం మరొ కరు ఆక్రమించుకుంటారనే వూహనే భరించలేకపోయాను. ఈ శిక్షకు నా అప రాధ మేమిటి? విధించటానికి మీకున్న హక్కు ఏమిటి? 'నేను తల్లిని కాలేక పోవటం' అంతేకదూ. దాన్నే యింకో రకంగా చెప్పనా? 'మీరు నన్ను తల్లిని

చేయలేకపోయారు. ఈ మాటంటే మీ మగతనం కోరలు దువ్వుతుంది. పౌరుషం మీసాలు మెలిపెడ్తుంది. యింకో పెళ్ళిని చేసుకోవాలనుకున్నారు. 'ఆ అమ్మాయినయినా తల్లిని చేయగలనా' అని ఎప్పుడైనా ఆలోచించారా? వుండరు ఆ ఆలోచనే మీకు అవమానం కదా.

స్తబ్దత గూడుకట్టుకుపోయిన జీవితంలో చిరుసంపదలు కావాలని మూగపోతున్న యీ గుండెలో మురళీరవాలు వినిపించాలని, 'అమ్మా' అనిపించుకోవాలని, ఆ అపూర్వానుభూతితో పరవశించాలని ఎంత తపనపడి వుంటానో మీకు తెలుసా? మమకారం, మమత లేని హృదయాలు ఎంత శూన్యంగా వుంటాయో మీ రెరుగుదురా?

నా ఆవేదనని, నా ఆరాటాన్ని గుర్తించి తపించి, దహించుకుపోయే గుండెను ఆప్యాయంగా, అమృతపు జల్లులా స్పృశించాలని గ్రహించడం పోయి నా తలమీద నిప్పులు పోయాలని చూశారు.

భగవంతుడే కాదు మీరూ నన్ను అన్యాయం చెయ్యాలని చూశారు. అందుకే....అందుకే.. తప్పుచేశాను. అది తప్పేనని ఒప్పుకుంటున్నాను. అయితే ఎందుకు చేశానో.... ఎలాంటి పరిస్థితులు నిన్ను అందుకుపురికొల్పాయో ఆలోచిస్తే తెలుస్తుంది. ఆ క్షణంలో నాకున్న ఒకే ఒక్క ఆలోచన, మార్గం. ఏం చేసయినా సరే మీరు నాకు మాత్రమే వుండిపోవాలన్న గాఢమైన కోరిక, మనిద్దరి మధ్య అధిగమించలేని అగాధాల్ని సృష్టిస్తున్న యీ ఒక్క పమస్య తీరగలిగితే....

మీరు దూరమైపోతారని ఎంత కుమిలిపోయానో.... మీకు దగ్గర కావాలని ఎంత బెంగటిల్లిపోయానో నాకు తెలుసు.

'అమ్మ' అనే పిలుపుకోసం దప్పిగొని ఎండి మోడయిన నా జీవితంలో మాతృత్వం అనుభవంకోసం పరితపించాను.

మీ జీవితంలోకి మరొకరి ప్రవేశాన్ని భరించలేక, మిమ్మల్ని పోగొట్టుకోలేక చిత్రవధ అనుభవించాను.

యిప్పుడు చెప్పండి. నే నెందుకు తప్పుచేశానో....అందుకు కారకులెవరో, బాధ్యత ఎవరిదో.... బాగా ఆలోచించి చూడండి.

నేను చెప్పకపోతే ఎప్పటికీ తెలీని యీ రహస్యం ఎందుకు చెబుతున్నానో తెలుసా? నా జీవితాన్ని పణంగా పెట్టి చెబుతున్నాను. క్షణంక్షణం వంచిస్తూ మీతో కాపురం చేయలేని నా బేలతనం. అపరాధభావంతో క్రుంగిపోయే ఆడతనం, తల్లిని కావాలనే ఆశ అడియాశ కాగా భార్యగా మాత్రమే వుండిపోతే చాలనుకున్నాను. కాని ఆ భార్యగాకూడా నా స్థానం నిలుపుకోడానికి తల్లిని కాక తప్పలేదు. బాగా యోచించి చూడండి.

మీ నిర్ణయం ఏదయినా నాకు శిరోధార్యమే. మీ రిప్పుడు నన్ను దూరం చేసినా యీ మాతృత్వపు బంధంతో నా జీవితాన్ని పెనవేసుకోగలను. ఏదో ఒక బంధం తగిలించుకోకపోతే జీవితమే లేదనుకునే ఆడవాళ్ళలో నేనూ ఒకదాన్ని. తండ్రి కావాలనుకుని మీ అభిజాత్యాన్ని స్వేచ్ఛగా హక్కుగా వాడుకోవాలనుకున్నారు. తల్లిని కావాలనుకున్న నా ఆరాటాన్ని తప్పిదంగా గుర్తించగలరు. ఎక్కడుంది జీవన న్యాయం? సంఘంలోనా? మనుషులలోనా?, మనసులలోనా? మన చుట్టూ పరిభ్రమిస్తున్న నియమాల పరిధిలోనా?

చాలా వ్రాశాను. యింతకు రెట్టింపుగా మీరు ఆలోచించా లనుకుంటాను. మీ జవాబునుబట్టి నా ప్రయాణం ఎక్కడికి, ఎలా అన్నది నిర్ణయించుకుంటాను. ఎదురుచూస్తుంటాను.

'మీ జానకి'

* * *

తుషార బిందువుల్లా చలిగాలులు ముఖానికి ఆహ్లాద పరుస్తున్నాయి. ఒడిలో బాబు నిద్రపోతున్నాడు. నా మస్తిష్కం నిండా, నా మనసునిండా, నా కళ్ళనిండా ఆ అక్షరాలే మెదులుతున్నాయి, కదులుతున్నాయి, మరీమరీ మననం చేసుకుంటూ.

"అపరాధం నాది. పరిహారం చెల్లించాల్సిందీ నేనే. నేను చెల్లించే పరిహారం బాబుకి తండ్రిని కావటమే. బాబుతో కలిసివచ్చే నీకోసం ఎదురుచూస్తుంటాను. కాని ఒక్క షరతు జానకీ, మళ్ళీ మరొక్కసారి తల్లిని కావాలనిమాత్రం కోరుకోవు కదూ. యిది న్యాయమే ననుకుంటాను."

బస్సు గమ్యంవైపు వేగంగా పరుగు తీస్తోంది.

శిశిరం తరువాతి వసంతంలాగ .... వాన కురిసినరాత్రి తరువాతి సూర్యోదయంలాగ సరికొత్త చైతన్యం నా మనసులో, తనువులో నా జీవితంలోనే.

